## దక్షిణాది బద్రి.. లింబాద్రి


2

## రాజకీయ లబ్ధి కోసమే పార్టీ మారిన పోచారం


2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

24-10-2025

NIZAMABAD / KAMAREDDY

PAGES - 2


## శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద..

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద పెరిగింది. దీంతో అధికారులు శుక్రవారం ఉదయం నాలుగు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. జలాశయంలోకి ప్రస్తుతం 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో సమానంగా ఉండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.



## సిద్ధాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, వర్ని:** వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం సందర్శించారు. కాలినడకన వెళ్లి పరిశీలించారు. నిజాంసాగర్ నాన్‌కమాండ్ ఏరియా పరిధిలోని సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాలకు నీటిని అందించేందుకు ఈ రిజర్వాయర్ నిర్మాణం కీలకం కావడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. రిజర్వాయర్ కట్ట నిర్మాణానికి సరిహద్దు ప్రాంతాలను నిర్ధారించేందుకు రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించే క్రమంలో వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కాలినడకన వాగులు, కొండలు దాటుతూ రిజర్వాయర్ కట్ట నిర్మిస్తున్న ప్రాంతానికి కలెక్టర్ చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ఫారెస్ట్ గెజిట్ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన అటవీ సరిహద్దును పరిశీలించారు. రిజర్వాయర్‌కు సంబంధించి స్థల వివాదాలపై బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్ తదితరులతో కలెక్టర్ చర్చించారు. హద్దులను కచ్చితంగా నిర్ధారించి పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అటవీ భూమి అవసరమైతే.. భూసేకరణ, అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ సాయిలు అధికారులు ఉన్నారు.



## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, బోధన్:** పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. మండలంలోని పెగడాపల్లి, బర్దిపూర్ గ్రామాల్లో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కోసం రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా రూ.5 లక్షలు అందిస్తూ వారికి సొంతింటికల నెరవేరుస్తోందన్నారు. అదేవిధంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందిస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామన్నారు. పదేళ్ల నుంచి బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. తద్వారా అభివృద్ధి జరుగుతోందని సుదర్శన్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గంగా శంకర్, బోధన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శీలం శంకర్ పాల్గొన్నారు.





“ తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జనం బాట పట్టనున్నారు. ప్రజలు, మేధావులు, విద్యావంతులతో మమేకం కానున్నారు. అందుకోసమే జనం బాట పేరుతో సుదీర్ఘ యాత్ర చేయనున్నారు. 33 జిల్లాల్లో కొనసాగనున్న ఈ యాత్రను శనివారం నుంచి ప్రారంభించనున్నారు. తన కార్యక్షేత్రమైన ఇందూరు గడ్డ నుంచే జనం బాట కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టనున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత తన సొంత వేదిక ఏర్పాట్లలో నిమగ్నమైన కవిత.. తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. అందులో భాగంగానే ఇటీవల పలు కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఇక శనివారం నుంచి జనం బాట పేరుతో జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 13 వరకు నాలుగు నెలల పాటు జిల్లాల పర్యటన కొనసాగనుంది. – అక్షరటుడే, ఇందూరు

# కవిత జనం బాట

- ఇందూరు గడ్డపై రేపటి నుంచి ప్రారంభం
- 33 జిల్లాల్లో కొనసాగనున్న యాత్ర
- ప్రతి జిల్లాలో రెండ్రోజుల పాటు బస
- ప్రజలు, మేధావులతో సమావేశాలు
- యాత్ర తర్వాత పార్టీని ప్రకటించే అవకాశం

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ముద్దుల తనయ కవిత తెలంగాణ ఉద్యమ సమయంలో తనదైన పోరాట పంథాతో అందరి దృష్టిని ఆకర్షించారు. తెలంగాణ జాగృతిని స్థాపించిన కవిత.. ఉద్యమ కాలం నుంచే పోరాట పంథాలో దూసుకెళ్లారు. తెలంగాణ సాంస్కృతిక వైభవమైన బతుకమ్మను ఉద్యమంలో భాగం చేసిన ఆమె.. మహిళలను సైతం స్వరాష్ట్ర పోరాటంలో భాగస్వాములను చేశారు. ఉద్యమ లక్ష్యం నెరవేరడంలో కీలక పాత్ర పోషించడంతో పాటు బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కవితకే దక్కింది. స్వరాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసిన కేసీఆర్ తనయ.. ఘన విజయం సాధించింది. ఎంపీగా ఐదేళ్లు పసుపుబోర్డు సాధన సహా వివిధ అంశాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ఆమె విజయం సాధించారు. 2018లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సహకరించక పోవడంతో ఆమె అనూహ్యంగా ఓడిపోయారు. ఆ తర్వాత కేసీఆర్ ఆమెను ఎమ్మెల్సీ చేశారు.

### స్వతహాగా ఎదిగేందుకు

రాజకీయ ఆకాంక్షలు మెండుగా ఉన్న కవిత.. తొలి నుంచే స్వతహాగా ఎదిగేందుకు ప్రయత్నించారు. తెలంగాణ జాగృతి స్థాపన ద్వారా తనకంటూ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసుకున్నారు. బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉంటూనే జాగృతిని బలోపేతం చేశారు. భారీ రాజకీయ ఆకాంక్షలు ఉన్న కవిత పట్ల గులాబీ పార్టీలో వ్యతిరేకత ఏర్పడింది. అందులో భాగంగానే 2018, 2023 ఎన్నికల్లో ఆమె ఓడిపోవాల్సి వచ్చింది. సామాజిక తెలంగాణ రాలేదని, పదేళ్లలో చేయాల్సినంత చేయలేకపోమని ఆమె చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కవితను బీఆర్ఎస్ దూరం పెట్టింది. తనపై కుట్ర పన్ని పార్టీ నుంచి వెళ్లగొట్టారని ఆమె బహిరంగంగానే తన ఆవేదనను వ్యక్తం చేశారు. హరీశ్‌రావు, సంతోష్‌రావులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన కవిత.. ఇక బీఆర్ఎస్‌తో నేరుగా తలపడేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే తన సొంత వేదికను ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### జిల్లాలో నేటి నుంచి..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం నుంచి ‘జనంబాట’ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు 25వ తేదీకి సంబంధించిన షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందులో భాగంగా కవిత.. మధ్యాహ్నం ఒంటి గంటకు జిల్లాలోని ఇందల్వాయి టోల్‌గేట్‌కు చేరుకుంటారు. అక్కడ జాగృతి శ్రేణులు కవితకు స్వాగతం పలకనున్నారు. అనంతరం బర్దిపూర్‌లోని ఈనాడు కార్యాలయం వద్ద నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు.

మధ్యాహ్నం 2 గంటలకు నిజామాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయం వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. సాయంత్రం 4 గంటలకు నవీపేట మండలం యంచ గ్రామంలో గోదావరి వరద ముంపు బాధితులతో సమావేశం నిర్వహించనున్నారు. 6 గంటలకు నందిపేట మండలం సీహెచ్ కొండూరులోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు.

### కేసీఆర్ ఫొటో లేకుండానే యాత్ర..

బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించేశాక కవిత జాగృతిని బలోపేతం చేశారు. వివిధ కమిటీలు వేశారు. అలాగే, సామాజిక అంశాలపై ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీని స్థాపిస్తారన్న ప్రచారం నిత్యకృత్యమైంది. ఇదే విషయాన్ని కవిత కూడా పరోక్షంగా అంగీకరించారు. ప్రజలు కోరుకుంటే, జనాలకు మేలు జరుగుతుందంటే తప్పకుండా పార్టీ పెడతానని యాదగిరిగుట్ట సాక్షిగా ప్రకటించారు. తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేయాలన్న తపనతో ఉన్న కవిత.. జనం బాట పేరుతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందుకోసమే శనివారం నుంచి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. అయితే, తన తండ్రి ఫొటో లేకుండానే కవిత ఈ యాత్ర చేపట్టనుండడం విశేషం. సామాజిక తెలంగాణ కోసమే తమ పోరాటం అని చెబుతున్న ఆమె.. తన యాత్రలో బీఆర్ఎస్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే హరీశ్‌రావు, సంతోష్‌రావులను విమర్శిస్తున్న ఆమె.. తదుపరి ఎవరిని టార్గెట్ చేస్తారన్నది ఆసక్తి కలిగిస్తోంది. సామాజిక తెలంగాణ కోసం ఏం చేయాలనే విషయాలను ప్రజల నుంచి తెలుసుకోవడమే లక్ష్యంగా జనం బాట చేపడుతున్నట్లు కవిత ఇటీవల ప్రకటించారు. ఈ క్రమంలోనే మేధావులు, విద్యావంతులు అన్ని వర్గాల ప్రజలను కలిసి మేధోమథనం చేస్తామన్నారు. ఆ తర్వాత ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## హోంగార్డుపై సస్పెన్షన్ వేటు

**అక్షరటుడే, కామారెడ్డి:** అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న హోంగార్డుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా హోంగార్డు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు హెచ్.రవి జులై 30 నుంచి విధులకు గైర్హాజరవుతున్నాడు. అధికారికంగా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్నాడన్న రిపోర్ట్ ఎస్పీకి చేరింది. దీంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తూ అనుమతి లేకుండా గైర్హాజరవుతున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత, పోలీసు శాఖ ప్రతిష్టకు విఘాతం కలిగించినా.. నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వర్తించాలని చెప్పారు.

## 27న జిల్లాలో మద్యం దుకాణాలకు లక్కీడ్రా



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నూతన మద్యం పాలసీ 2025-27కు గాను జిల్లాలో 102 మద్యం షాపులకు 2,786 దరఖాస్తులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియ గురువారంతో ముగిసిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వివరించారు. దరఖాస్తుల ద్వారా నిజామాబాద్ జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ. 83.58 కోట్లు వచ్చిందన్నారు. నిజామాబాద్ పరిధిలో 36 మద్యం దుకాణాలకు 963 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. అలాగే బోధన్‌లో 18 మద్యం దుకాణాలకు 455 దరఖాస్తులు, ఆర్మూర్‌లో 25 మద్యం దుకాణాలకు 618 దరఖాస్తులు వచ్చాయన్నారు. భీమ్‌గల్‌లో 12 మద్యం దుకాణాలకు 369 దరఖాస్తులు వచ్చాయని, మోర్తాడ్ పరిధిలో 11 మద్యం షాపులకు 381 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఏర్గట్లలో 94వ నంబర్ మద్యం దుకాణానికి అత్యధికంగా 96 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఆలూర్‌లోని 66వ నంబర్ మద్యం షాప్‌నకు 74 దరఖాస్తులు, వేల్పూర్ మండలంలోని మద్యం దుకాణానికి 69 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు నగరంలోని భారతి గార్డెన్స్‌లో మద్యం దుకాణాలకు లక్కీడ్రా నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో డ్రా తీయనున్నట్లు చెప్పారు. ఎంపికైన లైసెన్స్ దారులు అదే రోజు 1/6వ వంతు లైసెన్స్ ఫీజును భారతి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్ కౌంటర్‌లో కట్టాల్సి ఉంటుందన్నారు. 27న ఉదయం 9 గంటలకు తమ హాల్ టికెట్‌తో భారతి గార్డెన్‌కు చేరుకోవాలన్నారు.



## రెండేళ్లలో డబ్లింగ్ పనులు పూర్తి: డీఆర్ఎం

**అక్షరటుడే, ఇందూరు:** వచ్చే రెండేళ్లలో నిజామాబాద్ నుంచి ముథ్కేడ్ వరకు డబ్లింగ్ పనులు పూర్తవుతాయని సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డబ్లింగ్ పనులు ప్రస్తుతం మేడ్చల్ వరకు పూర్తయ్యాయన్నారు. అలాగే నిజామాబాద్ రైల్వేస్టేషన్ పనులు 50 శాతం పూర్తయ్యాయని, ఏప్రిల్ వరకు మొత్తం పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. స్టేషన్‌కు అమృత్ పథకం కింద రూ.57 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. ఐదు ఎస్కలేటర్లు, మూడు లిఫ్టులు ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్, పొడవైన ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో వర్షాలు పడితే ఇబ్బందులు ఏర్పడేవని, ప్రస్తుతం ప్లాట్‌ఫామ్ ఎత్తు పెంచామని, ఇకపై ఇబ్బందులు ఉండవన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిజామాబాద్ మీదుగా సికింద్రాబాద్ నుంచి ఢిల్లీకి నిజాముద్దీన్ ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు డీఆర్ఎం పేర్కొన్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా వారానికి రెండుసార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా భవిష్యత్తులో రెగ్యులర్ చేస్తామన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లే రైలు నిజామాబాద్‌కు 1:25 పీఎంకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే నిజామాబాద్‌లో ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని గూడ్స్ షెడ్‌ను జానకంపేట్‌లో ఏర్పాటు చేశామన్నారు. దసరా, దీపావళి పండుగలను నిజామాబాద్ మీదుగా 34 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఇందులో సుమారు 32 లక్షల మంది ప్రయాణించారని వివరించారు.

## వెల్లుట్ల, అన్నాసాగర్‌లో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. వెల్లుట్ల, అన్నాసాగర్ గ్రామాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి ఈ ఆరోగ్య కేంద్రాలు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. ప్రజలు ఈ సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించేందుకు కృషి చేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్లు, మండల సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వెల్లుట్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





## అన్నిపథకాల్లో మహిళలకు సముచిత స్థానం

**అక్షరటుడే, బాన్సువాడ:** రాష్ట్రంలో అమలవుతున్న అన్ని పథకాల్లోనూ మహిళలకు సముచిత స్థానం ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలో రూ.19 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన మహిళా మండలి భవనాన్ని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళా సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త భవనం మహిళా సంక్షేమ కార్యక్రమాలు, స్నేహ సమూహ సమావేశాలు, సామూహిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ వస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో వేగవంతమైన పురోగతి సాధించామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎర్వల కృష్ణారెడ్డి, రవీందర్, ఖలేక్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులకే సదరం ధ్రువీకరణ పత్రాలివ్వాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అర్హులైన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువీకరణ పత్రాలు అందించాలని డీఆర్డీవో సురేందర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం క్యాంప్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంప్‌నకు హాజరైన దివ్యాంగులతో మాట్లాడి వారికి కల్పించిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో ఆస్పత్రి గదులను పరిశీలించి సదరం క్యాంప్‌నకు అదనపు గదులు కల్పించాలని కోరారు. దివ్యాంగులతో ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ అబ్దుల్ అజీం, డీపీఎం సురేష్ కుమార్, డాక్టర్ సంతోష్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌డీఆర్ విత్తనాలతో అధిక లాభాలు

**అక్షరటుడే, బాల్కొండ :** ఆర్‌డీఆర్ విత్తనాలతో అధిక లాభాలు గడించవచ్చని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బాల్కొండలో వరిపంట క్షేత్ర దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు నర్సయ్య పొలంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సుప్రజ మాట్లాడుతూ రైతులకు అందించిన ఆర్‌డీఆర్ వరి రకం గురించి వివరించారు. అధిక దిగుబడితో పాటు ఈ విత్తనం ద్వారా రైతులు స్వయంగా విత్తనాన్ని తయారు చేసి తోటి రైతులకు సైతం విక్రయించి లాభాలు పొందవచ్చని సూచించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రయోజనాలను వివరించారు. రైతుల ఉత్పత్తులకు సరైన ధరలు లభించేందుకు, అలాగే విత్తనాలు, ఎరువులు వంటి ఇన్‌పుట్‌ను అందరూ కలిసి ఒకేసారి కొనుగోలు చేసుకొని ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. ఆర్‌డీఆర్ 1200 వరి రకానికి అనేక పురుగులు, తెగుళ్లను తట్టుకునే లక్షణం ఉందని తెలిపారు. రైతులు సరైన తేమ వద్ద నిల్వ చేసుకుని రాబోయే వానాకాలంలో సాగు చేసుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ హిందూధర్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రేష్మ, రైతుల కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు నర్సయ్య, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలి

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** సీపీఆర్‌పై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని ప్రభుత్వ వైద్యురాలు హసీనా సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌గా సీపీఆర్ ఏవిధంగా చేయాలో చేసి చూపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అయోడిన్ కొరత వల్ల థైరాయిడ్ సమస్యలు వస్తాయని వివరించారు. అయోడైజ్‌డ్ ఉప్పును వాడాలని సూచించారు. ఇది పిల్లల్లో పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. రోజూ ఐదు గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోవద్దని సూచించారు. ఎవరైనా గుండెపోటుకు గురయితే సరైనా సమయంలో స్పందించి సీపీఆర్ చేయడం వల్ల ఒక వ్యక్తి జీవితాన్ని కాపాడినట్లు అవుతుందని డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయపాల్ రెడ్డి, అధ్యాపకులు మధు, రాజకుమార్, వైష్ణవి, గంగాధర్, మహేందర్, శ్రీహరి, మురళీకృష్ణ, గంగారాం, హాస్పిటల్ సూపర్‌వైజర్ పద్మలత, ఏఎన్‌ఎంలు స్వరూప, కృష్ణవేణి పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



**అక్షరటుడే, నవీపేట్:** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన నవీపేట్ మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్ నుంచి బాసర వెళ్లే దారిలో నాగేపూర్ శివారులో మహిళ మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు నవీపేట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే మహిళ మృతదేహం కాలిపోయి ఉండడాన్ని గమనించిన పోలీసులు.. గురువారం రాత్రి ఈ ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా.. మృతురాలు మద్దెపల్లికి చెందిన శ్యామల లక్ష్మిగా గుర్తించారు.

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల కేంద్రానికి సమీపంలో కొండల నడుమ ప్రకృతి రమణీయతతో అలరారే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లింబాద్రి గుట్ట. శ్రీలక్ష్మి నృసింహస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12 రోజుల పాటు జరిగే ఈ జాతర ఉత్సవాలకు భక్తులు భారీ ఎత్తున తరలిరానున్నారు.

- అక్షరటుడే, భీమ్‌గల్



### లింబాద్రి గుట్ట విశిష్టత

ఉత్తర తెలంగాణలోనే ప్రముఖ ఆలయంగా విరాజిల్లుతున్న లింబాద్రి గుట్ట క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి కొలువై ఉన్నాడు. భీమ్‌గల్ పట్టణానికి ఐదు కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రం రెండంతస్తుల కొండపై వెలిసింది.

### క్షేత్ర దర్శనం..

కొండ మొదటి అంతస్తుకు మెట్ల మార్గం, రహదారి మార్గం ఉన్నాయి. ఇక్కడ శ్రీవారి మాడ వీధులు, కమలా పుష్కరిణి, కల్యాణ మండపం, రథం గుడి, క్షేత్ర పాలకుడైన అయోధ్య ఆంజనేయ స్వామి ఆలయం ఉన్నాయి.

# దక్షిణాది బద్రి.. లింబాద్రి

■ భీమ్‌గల్ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు స్వామివారిని మంగళ హారతులు, బోనాలు, బాజా భజంత్రీలతో భీమ్‌గల్ పట్టణంలోని గ్రామాలయం నుంచి లింబాద్రి గుట్టకు ఊరేగింపుగా తీసుకురావడంతోనే ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో ప్రధానంగా శ్రీవారి ఎదుర్కోలు, కల్యాణం, ధ్వజారోహణం, కొండ ప్రదక్షిణం, తులసీ వివాహం, జాతర, రథోత్సవం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తారు. ఏటా కార్తీక మాసంలో జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో కార్తీక పౌర్ణమి రోజున నిర్వహించే రథోత్సవానికి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు.

### గర్భాలయం..

రెండో అంతస్తులో లోతైన రాతి గుహలో స్వామివారి మూల విరాట్ కొలువై ఉంది. ఇరుకైన గుహ మార్గం గుండా సుమారు 250 మీటర్లు ప్రయాణిస్తే గర్భాలయానికి చేరుకోవచ్చు.

### శాంత స్వరూపం..

సాధారణంగా నరసింహ క్షేత్రాల్లో స్వామివారు ఉగ్ర రూపంలో దర్శనమిస్తారు. కానీ ఇక్కడ లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని శాంత రూపంలో భక్తులకు దర్శనమివ్వడం ఈ క్షేత్రంలోని విశేషం.

### దక్షిణ బద్రీనాథ్..

పవిత్ర బద్రీనాథ్ క్షేత్రం తరువాత గర్భాలయంలో స్వామివారి మూలవిరాట్ పక్కన నర నారాయణుల (కృష్ణార్జునుల) విగ్రహాలు ఇక్కడ మాత్రమే కనిపిస్తాయి. అందుకే ఈ క్షేత్రానికి దక్షిణ బద్రీనాథ్‌గా విశిష్టత లభించింది.

### జోడు లింగాలు..

గర్భాలయ మార్గం ప్రవేశ ద్వారం వద్ద భక్తులకు జోడు లింగాలు దర్శనమిస్తాయి. పరమశివుడు బ్రహ్మహత్యా దోష నివారణకు ఇక్కడ తపమాచరించి, దోష విముక్తుడై శ్రీవారి ఆజ్ఞతో ఈ రూపాన వెలిశాడని పురాణ కథనం.

### ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్ నుంచి నేరుగా ఆర్మూర్ వరకు బస్సు సౌకర్యం ఉంది. నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్ వరకు 25 కి.మీ. అక్కడి నుంచి భీమ్‌గల్ మండల కేంద్రానికి 25 కి.మీ. భీమ్‌గల్ నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న లింబాద్రి గుట్టకు బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. బ్రహ్మోత్సవాల సమయంలో దేవాలయం బస సౌకర్యం కల్పిస్తుంది.

### పౌరాణిక చరిత్ర..

శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వయంభూ క్షేత్రాల్లో లింబాద్రి గుట్ట ఒకటి. బ్రహ్మదేవుడు ఇక్కడ తపమాచరించి శ్రీహరిని నృసింహుడిగా సాక్షాత్కరింపజేసుకున్నాడని, దీంతో లక్ష్మీసమేతుడిగా స్వామివారు వెలిశారని పురాణాలు పేర్కొంటున్నాయి. యముడు బిల్వ వృక్ష రూపంలో, ఇంద్రుడు కమలాలతో స్వామిని పూజించి శాంతి, శాప విముక్తి పొందారని చరిత్ర చెబుతోంది. క్షేత్ర పాలకుడైన అయోధ్య హనుమాన్ శ్రీరాముని ఆజ్ఞతో ఇక్కడ తపమాచరించి నృసింహుడి రూపంలో ఉన్న శ్రీరాముడిని దర్శించుకున్నట్లు కథనం. సత్య హరిశ్చంద్రుడు, ధర్మరాజు, ప్రహ్లాదుడు సైతం ఈ క్షేత్రాన్ని దర్శించి తరించినట్లు పురాణ కథనాలు వివరిస్తున్నాయి.

### ప్రధాన ఉత్సవాలిలా..

- అక్టోబర్ 26 ఆదివారం శ్రీవారి నిత్య బ్రహ్మోత్సవ ఆరంభం సందర్భంగా క్షేత్రదేవి అయిన చండిక దేవికి (పెద్దగంటి ఎల్లమ్మతల్లి) సారె సమర్పణ.
- 27న శ్రీవారు మధ్యాహ్నం 1 గం.లకు గ్రామ ఆలయం నుంచి కొండపైకి బయలుదేరుతారు.
- 28న మంగళవారం దీపారాధన, పుణ్యా వచనం, అంకురార్పణ
- 29న ధ్వజారోహణం
- 30న శ్రవణ ప్రయుక్త క్షీరాభిషేకం, నృసింహ ఏకాక్షరి హవనం, అన్నకుటోత్సవం, శ్రీవారి కల్యాణం ఎదుర్కోలు.
- 31న శ్రీవారి కల్యాణోత్సవం మధ్యాహ్నం 12:30 గంటలకు.
- నవంబర్ 1న విద్ధ ఏకాదశి, నృసింహ ఏకాక్షరి హవనం.
- 2న ఉపవాస ద్వాదశి సాయంత్రం ఐదు గంటలకు గరుడ సేవ
- 3న పారణ త్రయోదశి వైకుంఠ చతుర్దశి ప్రభుదోత్సవం తులసి వివాహం కొండ ప్రదక్షణం.
- 4న మంగళవారం ధాత్రిమూలే నరసింహ పూజ ధాత్రి హవనం.
- 5న జాతర, శ్రీవారి రథోత్సవం మధ్యాహ్నం 3 గంటలకు.
- 6న శేష హమం, చక్రతీర్థం, వ్యాస పూజ, పూర్ణాహుతి, పుష్పయాగము
- 7న దేవతూద్వాసనం, ధ్వజారోహణం, ఉద్వాసన బలిప్రదానం, కొండబలి, పుష్పరిణిపై డోలోత్సవం, తదితర కార్యక్రమాల అనంతరం సాయంత్రం శ్రీవారు అశ్వవాహనంపై గ్రామ ఆలయానికి శాస్త్రోక్తంగా వేంచేయుట, సప్తవారణ పూజతో ఉత్సవాలు ముగుస్తాయి.

## గోరక్షకుడిపై దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి



**అక్షరటుడే,ఇందూరు:** హైదరాబాద్ శివారులోని పోచారం ఐటీ కారిడార్‌లోని యమ్నంపేట వద్ద గోరక్షకుడిపై దాడిచేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోరక్షకులపై దాడులను నిలువరించాలని కోరారు. గోవులను అక్రమంగా తరలిస్తుంటే అడ్డుకున్నందున అతడిపై దాడిచేయడం క్రూరమైన చర్యగా వారు అభివర్ణించారు.

## రాజకీయ లబ్ధి కోసమే పార్టీ మారిన పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** నియోజకవర్గ ప్రజల కోసం కాదు.. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయన రాజకీయ లబ్ధి, స్వార్థం కోసమే పార్టీ మారారని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బాన్సువాడ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోసం సీఎం వద్దకు వెళ్లావంటే పార్టీ మారినట్టే కదా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. సన్నవడ్లకు బోనస్, రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏపార్టీలో ఉన్నారో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారన్నారు.

## మాచర్లలో ఉపాధి పథకంపై గ్రామసభ



**అక్షర టుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని మాచర్లలో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ తయారీ, గ్రామంలో చేపట్టబోయే పనుల గుర్తింపు, ఆమోదంపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు గుర్తించి పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కూడా చర్చించి, పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి నితీష్, పంచాయతీ కార్యదర్శి నసీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కవిత 'జనంబాట' పోస్టర్ల ఆవిష్కరణ

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రేపటి నుంచి జిల్లాలో చేపట్టనున్న 'జనంబాట'ను విజయవంతం చేయాలని దేవితండా దేవిఘడ్ సేవాలాల్ మహారాజ్ ఆలయ పూజారి శివరామ్ మహారాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ఆవరణలో జనంబాటకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న జనంబాట కార్యక్రమం జిల్లా నుంచే ప్రారంభించడం సంతోషకరమన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి బయలుదేరిన అనంతరం కల్వకుంట్ల కవిత ఇందల్వాయిలోని దేవితండా దేవిఘడ్ మహారాజ్ ఆలయాన్ని సందర్శిస్తారని వివరించారు. కార్యక్రమంలో దేవితండా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసులు



**అక్షరటుడే, ముప్కాల్:** తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయనున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. ఈ మేరకు ముప్కాల్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి ఆధ్వర్యంలో ఎంఈవో జె రవి కుమార్‌కు శుక్రవారం సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మధ్యాహ్న కార్మికులకు ప్రభుత్వం రూ.10 కోట్ల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల చిన్నచూపు చూపడం తగదన్నారు. దసరా, దీపావళి పండుగల సమయంలోనూ వేతనం అందని పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముప్కాల్ మధ్యాహ్న భోజన అధ్యక్షురాలు లలిత, కార్మికులు ప్రమీల, శశికళ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలకు ప్రయోగ పరికరాల అందజేత



**అక్షర టుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రయోగ పరికరాలు అందజేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఫర్నిచర్, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది గరిక భవాని, గణేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.